క్లుప్తంగా

ఆకివీడు ఎస్సైగా ఫణిమోహన్



ఫణిమోహన్

ఆకివీడు: ఆకివీడు ఎస్ఐగా ఫణిమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా ఉన్న సత్యసాయి భీమవరం టౌన్‌లో విధులు కొనసాగిస్తారు. క్రైం బ్రాంచ్ నుండి ఫణిమోహన్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సంధ్య కుటుంబానికి రక్షణ కల్పించాలి



వివరాలు తెలుసుకుంటున్న ఉచ్చుల సుజాత

ఆకివీడు: అతి కిరాతకంగా సంధ్యను హత్య చేసిన వాడపల్లి రాంబాబు నుంచి మృతురాలి తల్లిదండ్రులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి, ఏబీబీఎస్ ఉమెన్ సెల్ అధ్యక్షురాలు ఉచ్చుల సుజాత డిమాండ్ చేశారు. మృతురాలి తల్లిదండ్రుల్ని సోమవారం ఆమె పరామర్శించారు. రాంబాబు నుంచి సంధ్య తల్లిదండ్రులకు హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. దోషికి యావజ్జీవ కారాగార శిక్షవిధించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ సత్యసాయికి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు.

ప్రజలంతా శాంతినే కాంక్షించాలి



ఉండిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఉండి: ప్రజలంతా శాంతిమార్గంలో పయనిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుద్దామని, ప్రజలంతా శాంతినే కాంక్షించాలని మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం ఉండి సెంటర్‌లో సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా శాంతియుతంగా జీవించాలని, మనల్ని కాపాడుకుంటూనే తోటివారి శాంతి సంతోషాలకు భంగం కలిగించకూడదని అన్నారు. అలాగే పర్యావరణాన్ని ప్రేమిస్తూ మొక్కలు పెంపకం చేయాలన్నారు. సంస్థ ద్వారా మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సూర్యనారాయణరాజు, కత్రిడ్డి సత్యనారాయణ, దంగేటి రామలింగేశ్వరరావు, కొమ్మన నాగబాబు, పీఆర్‌కే రాజు, కూనపరాజు వెంకటరామరాజు, దివ్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సీనియర్ కయాకింగ్ పోటీలకు విష్ణు విద్యార్థి



విష్ణు కళాశాలలో నాయక్‌ను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జాతీయ సీనియర్ కయాకింగ్ పోటీలకు భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి బి.అంజనీకుమార్ నాయక్ ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం కళాశాలలో నాయక్‌ను అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఈనెల 20న విజయవాడలోని పున్నమిఘాట్‌లో నిర్వహించిన కయాకింగ్ పోటీల 500 మీటర్ల పందెంలో నాయక్ బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు చెప్పారు. ఉత్తరాకాండ్‌లోని తెహ్రిడామ్‌లో సెప్టెంబర్ 14 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే జాతీయ పోటీల్లో నాయక్ పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విజేత నాయక్, శిక్షణ ఇచ్చిన తిరుపతిరావును కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, పీడీ శ్రీనివాసరావు, వేణు తదితరులు అభినందించారు.

కుక్క దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

పోడూరు: పోడూరులో కుక్క దాడి చేయడంతో ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలోని పల్లగుంట ప్రాంతానికి చెందిన బొక్కా వెంకట పవన్ సాయి, గండికోట సాలంరాజు, మోటూరి హనుమంతు ఆదివారం తమ ఇళ్ల వద్ద ఆడుకుంటుండగా రోడ్డుపై వెళుతున్న కుక్క దాడి చేసి ముగ్గురినీ తీవ్రంగా గాయపర్చింది. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది వీరిని చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారులకు చికిత్స అందించి ఇళ్లకు పంపించారు. కాగా కుక్క చిన్నారులపై దాడి చేయడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇంకా ఎవరిపైనైనా దాడి చేయవచ్చనే భయంతో ఆ కుక్కను గ్రామస్తులు చంపినట్లు తెలిసింది.

దొరగారి చెరువు రోడ్డు నిర్మాణానికి మోక్షం



ఆకివీడు వైఎస్సార్ సెంటర్ నుంచి సిద్ధాపురం వైపు సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతం ఇదే

ఆకివీడు: పట్టణంలోని వైఎస్సార్ సెంటర్ నుంచి దొరగారి చెరువు గట్టుకు చేర్చి సిద్ధాపురం వంతెన వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి, అజ్జమూరు నుంచి కుప్పనపూడి గ్రామంలోని సీసీ రోడ్డు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ రోడ్డు మరమ్మతుల గ్రాంటు ద్వారా నిధులు కేటాయించింది. గత 15 ఏళ్లుగా స్థానిక వైఎస్సార్ సెంటర్ నుంచి సిద్ధాపురం వంతెన వరకు రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. పలుసార్లు మరమ్మతులు చేసినప్పటికీ రోడ్డు గుంతలమయంగా ఉండి ప్రజల రాకపోకలకు అవస్థలు తప్పేవి కావు. వర్షాకాలంలో రోడ్డు మరీ అధ్వాన స్థితికి చేరేది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఈ రోడ్డు అభివృద్ధి కోసం నిధులు మంజూరుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. రాష్ట్ర రోడ్డు మరమ్మతుల నిధుల నుంచి ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి, అజ్జమూరులోని జాతీయరహదారి నుంచి కుప్పనపూడి గ్రామంలోని సీసీ రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మాణం, అజ్జమూరు గ్రామం మధ్యలో సీసీ రోడ్డు నిర్మాణం సుమారు 250 మీటర్ల మేర అభివృద్ధికి రూ.2.50 కోట్లు నిధులు వెచ్చించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ సోమవారం చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు భారీ గుంతలుగా తయారైందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత తాత్కాలిక మరమ్మతులు అనేకసార్లు చేపట్టామని చెప్పారు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణంతోనే సమస్య పరిష్కారం అవుతుందని భావించి నిధుల మంజూరుకు కృషి చేశానని చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతారని పీవీఎల్ తెలిపారు. వైఎస్సార్ సెంటర్ నుంచి సిద్ధాపురం గేటు వరకూ సీసీ రోడ్డు నిర్మాణంతో కొల్లేరు తీరంలోని ఐదు గ్రామాల ప్రజలతో పాటు దుంపగడప గ్రామస్తులు పట్టణంలోకి వచ్చేందుకు మార్గం సుగమమవుతోందని చెప్పారు. అజ్జమూరు గ్రామంలో కూడా తరచూ రోడ్డు మరమ్మతులకు గురవుతుందని, ఆ ప్రాంతంలో కూడా సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. దీంతో ఆకివీడు నుంచి కాళ్ల మండల కేంద్రానికి వెళ్లేందుకు మార్గం సుగమమవుతోందని చెప్పారు.

'నాపై కేసు మోపడం అన్యాయం'



వాండ్రంలో మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వెంకటకృష్ణ

ఉండి: గత కొద్దిరోజులుగా వాండ్రంలో జరుగుతున్న కొన్ని అనివార్య సంఘటనలు పరిష్కరించే క్రమంలో తనను కేసులో ఇరికించడం దారుణమని గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం గ్రామంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాట పురస్కరించుకుని 18వ తేదీ రాత్రి తన ప్రేరేపణతో స్థానిక చర్చిపై దాడి జరిగిందని ఆరోపించడం తనను బాధిస్తోందని అన్నారు. ఇరువర్గాల పెద్దలతో మాట్లాడి తగాదా రాజీ చేసి సఖ్యత చేయాలని తామంతా చూసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలంతా సఖ్యతతో ఉండేలా తాను ప్రయత్నిస్తుంటే కొందరు తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక నాపై కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. తాను గ్రామ ప్రజలతో కలసిమెలసి ఉంటూ గొడవలు చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్న తనను దాడికి పురికొల్పినట్లు కేసులో ఇరికించడం ఎంతవరకు సబబు అన్నారు. చర్చిపై జరిగిన దాడి ఘటనపై అధికారులు నిస్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముదుండి స్వరూప శ్యాం, వార్డు సభ్యులు ఇజ్జరోతు శ్రీనివాస్, పి.నర్సింగరావు, పీ నారాయణరావు పాల్గొన్నారు.

వాండ్రం బాధితులకు దళిత జేఏసీ సంఘీభావం



వాండ్రంలో దళితులకు సంఘీభావం తెలుపుతున్న దళిత జేఏసీ నాయకులు

ఉండి: వాండ్రంలో దళితులపై దాడిని ఖండిస్తున్నామని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని దళిత జేఏసీ కన్వీనర్ తాళ్లూరి మధు అన్నారు. సోమవారం వాండ్రం దళితపేటలో జేఏసీ నాయకులు పర్యటించారు. గత కొద్దిరోజుల క్రితం దళితులపైనా చర్చిపైనా జరిగిన దాడి చాలా దారుణమన్నారు. దళితులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీ, ఉపాధ్యక్షుడు బిరుదుగడ్డ రమేష్‌బాబు మాట్లాడుతూ దళితులపై జరిగిన దాడిని యావత్తు దళిత నాయకులు ఖండిస్తున్నారని, తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. చర్చిపై దాడికి కారకులను వెంటనే శిక్షించాలని కోరుతున్నామన్నారు. దళితులకు న్యాయం జరగకపోతే నిరాహార దీక్షలకు కూడా వెనుకాడబోమన్నారు. అధికారులు ఈ కేసులపై నిస్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సంయుక్త కార్యదర్శి దానం విద్యాసాగర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుంగా ఆదాము, పిల్లా శ్రీనివాస్, పీ నర్సింహరావు, తాళ్ళూరి రాజ్‌కుమార్, స్థానిక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలి



గొల్లలకోడేరులో ఎస్పీ రవిప్రకాష్‌ను కలిసిన పొన్నమండ బాలకృష్ణ, సీహెచ్ మంగరాజు

పాలకోడేరు: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, సీహెచ్ మంగరాజు జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు గొల్లలకోడేరులో ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు.

శాంపిల్ మందుల విక్రయాలపై దాడులు

పాలకోడేరు: అనధికారికంగా శాంపిల్స్ మందులు విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు మందుల షాపు పై దాడి చేసి రూ.రెండు లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్లు డ్రగ్ అధికారులు చెప్పారు. వివరాలు ఇలా వున్నాయి.పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన శ్రీనివాసా మెడికల్ స్టోర్స్ యజమాని కలిదిండి విజయకుమార్ రాజు మెడికల్ రెప్రజెంటేటివ్ ల నుంచి శాంపిల్స్ మందులను తక్కువ రేటుకు కొనుగోలు చేసి, అమ్ముతున్నట్లు తమకు పక్కాగా అందిన సమాచారం మేరకు సోమవారం దాడి చేసి సుమారు రూ.రెండు లక్షల విలువైన ఔషధాలను స్వాధీనం చేసుకున్నామని భీమవరం డ్రగ్ ఇన్స్పెక్టర్ అబిద్ అలీ, తణుకు డ్రగ్ ఇన్స్పెక్టర్ పి.మల్లికార్జున్ తెలిపారు. మల్టీ నేషనల్ కంపెనీలు వైద్యులకు తమ ఉత్పత్తులను పరిచయం చేసేందుకు గాను మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు శాంపిల్ మందులను అందిస్తాయని, అయితే వారి నుంచి తక్కువ రేటుకు మెడికల్ షాపుల యజమానులు కొనుగోలు చేసి అమ్ముతున్నారని అన్నారు. కాగా మత్తు మందులు కూడా అమ్ముతున్నట్లు తమకు సమాచారం ఉందని దానిపై కూడా ఆరా తీస్తున్నామన్నారు. కలిదిండి విజయ్ కుమార్ రాజు పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని డ్రగ్ అధికారులు తెలిపారు. రిప్రజెంటేటివ్‌లపై కూడా కేసు నమోదు చేస్తామని చెప్పారు.

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్ రెడ్డి

మొగల్తూరు: ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా గడువు ముగిసిందన్నారు. బీఎల్‌వోలు చేసిన ఓటర్ల నమోదు, ఫారం 6,7,8లపై ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఎంత మందిని కొత్త ఓటర్ల జాబితాలో చేర్చారు, ఎంత మంది ఓటర్లను తొలగించారని అడిగి తెలుసుకున్నారు. 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వివరాలు, 18 సంవత్సరాలు నిండిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. మండల స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ జి.అనితా కుమారి, డీటీ నరేష్, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, ఆర్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలి

నరసాపురం రూరల్: సకాలంలో ఓటర్ల జాబితా సవరణ పూర్తిచేసి త్వరితగతిన ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని జేసీ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నరసాపురం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటి వరకు జరిగిన ఓటర్ల జాబితా సవరణను అడిగి లెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వే నేటితో ముగుస్తున్నందున బీఎల్‌వోలు, మండలాల ప్రత్యేకాధికారులు సమన్వయంతో రీ వెరిఫికేషన్ చేసుకుని సంబంధిత రిపోర్టులు అన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఫాజిల్, డిప్యూటీ తహసీల్దార్ నాగదేవి, ఆర్ఐ యశోధ తదితరులు ఉన్నారు.

స్పందనలో 6 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం బదిలీ చేసినట్లు వివరించారు.

ఐటీఐలలో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేయండి

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను మిగిలి ఉన్న సీట్లకు మూడోదఫా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు కోరారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు ఉండి ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో కేవలం డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ ట్రేడులో మాత్రమే పరిమిత సీట్లు ఉన్నాయని, మిగిలిన సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈ ట్రేడులో ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేయాలని శ్రీనివాసరావు తెలిపారు.

పేద రోగికి ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: కీళ్ల వ్యాధితో బాధపడుతున్న మొగల్తూరు మండలం వారతిప్ప గ్రామానికి చెందిన ముదునూరి మాధవరాజుకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సహాయాన్ని క్షత్రియ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు కనుమూరి రామకృష్ణంరాజు చేతుల మీదుగా ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఇంటి వద్ద సోమవారం అందజేశారు. అలాగే ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు ప్రోత్సాహంతో వసుధ ఫౌండేషన్, కొంత మంది క్షత్రియ దాతల విరాళాలతో నివాస గృహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెన్మెత్స జగపతి సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ

పెనుగొండ: మానవత వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతి కోరుతూ సోమవారం ఆచంట మానవత మండల శాఖ ఆధ్వర్యాన గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, మానవత సభ్యులు పాల్గొని ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని, సేవా మార్గంలో నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు శివన్నారాయణ సతీష్ కుమార్, కార్యదర్శి బొక్కా రామకృష్ణ, కోశాధికారి నిమ్మకాయల గంగారావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యండగండి గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువతి ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయం నుంచి కనిపించడం లేదంటూ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తాడేపల్లిగూడెం: విద్యుత్ వినియోగదారులు నెలవారీ చెల్లించే విద్యుత్ బిల్లులను దానిపై ఉన్న క్యూ ఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి చెల్లించవచ్చని ఎలక్ట్రికల్ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం చెప్పారు. ఈ పద్ధతిలో ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే అవకాశం కల్పించామన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించిన ఎలాంటి దరఖాస్తు అయినా గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రమే రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. విద్యుత్ సర్వీసుకు ఆధార్ నంబరు లింకు కాని వారు ఆధార్ జిరాక్స్‌తో విద్యుత్ సెక్షన్ ఆఫీస్ అధికారులకు అందించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా 1912 కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. పూర్వీకుల పేరుమీద ఉన్న విద్యుత్ కనెక్షన్లను ప్రస్తుత యజమాని పేరుమీదకు మార్చుకొనేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఈ వెంకటేశ్వరరావు కోరారు.

వైఎస్సార్ సీపీ పాలకొల్లు పరిశీలకునిగా మధ్యాహ్నపు బలరామ్

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకునిగా ఏలూరుకు చెందిన పార్టీ నేత మధ్యాహ్నపు బలరామ్ నియమితులయ్యారు. సోమవారం వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు తణుకులో బలరామ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

మిథున్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే శ్రీనివాస్



తణుకులో ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం తణుకులో మర్యాదపూర్వకంగా కలిశారు. తణుకులో వైఎస్సార్ సేవాదళ్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మిథున్‌రెడ్డిని కలిసి భీమవరం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించడమేగాక ప్రతిపాదనల్లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితరులున్నారు.

25లోగా ఓటరుగా నమోదు చేసుకోండి



ఉండి దివ్యా కళాశాలలో విద్యార్థుల నుంచి ఓటు నమోదు పత్రాలు స్వీకరిస్తున్న మల్లికార్జునరావు

ఉండి: ఓటు హక్కు కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ఉండి దివ్యా కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ ఓటు నమోదుకు చివరి తేదీ అని తెలిపారు. ఓటు హక్కు అనేది చాలా గొప్పదని, దానిని అర్హులైన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. మన నిర్ణయాన్ని తెలియజేస్తూ ఓటు వేయడం మన కనీస బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీ అప్పారావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మానవత్వాన్ని మరిచిపోవద్దని సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక లయన్స్ కార్యాలయంలో వృద్ధుల సంక్షేమ సంఘం, లయన్స్‌క్లబ్, మంతెన సూర్యనారాయణరాజు, సుభద్రమ్మల ఫౌండేషన్ సంయుక్తంగా జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ మానవత్వానికి మించిన సేవ మరొకటి లేదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఆకివీడు వృద్ధుల సంఘం వృద్ధులకు విశిష్ట సేవలందిస్తోందన్నారు. రైతు నాయకుడు స్వర్గీయ మంతెన వెంకట సూర్యనారాయణరాజు పోలవరం ప్రాజెక్టు కోసం ఉద్యమించిన నాయకుల్లో ఒకరన్నారు. సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా రూ.20 లక్షల వ్యయంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం రవివర్మ ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విస్సాకోడేరు సర్పంచ్‌కు సన్మానం

పాలకోడేరు: రాజీవ్‌గాంధీ నేషనల్ మెమోరియల్ అవార్డ్ గ్రహీత, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌కు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూకల మురళీ గంగాధర సోమవారం చెప్పారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పరిసరాల శుభ్రత, ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామంగా గ్రామీణ అభివృద్ధి, అధ్యయన పరిశోధన అకాడమీ (తిరుపతి) గుర్తించిందన్నారు. దేశ వ్యాప్తంగా ఆరు గ్రామాలు ఎంపిక కాగా అందులో విస్సాకోడేరు గ్రామం ఒకటి. ఇటీవల బెంగళూరులో కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును సర్పంచ్ శ్రీనివాస్ అందుకున్నారన్నారు. సన్మాన కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

పదవీ కాంక్షతో చంద్రబాబు కుయుక్తులు

సాక్షి, భీమవరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పదవీకాంక్ష పిచ్చి పరాకాష్టకు చేరిందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. సోమవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. పేదల కష్టాలు పట్టించుకోని చంద్రబాబు అన్నీ నేనే కనిపెట్టానని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు పిచ్చికి సొంత పుత్రుడు లోకేష్, దత్తతపుత్రుడు పవన్‌కల్యాణ్ తోడయ్యారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతి పేరుతో ఆ ప్రాంతంలో పేదవాడు కూడా లేకుండా చేయాలనే దారుణమైన ఆలోచనలో ఉన్నారన్నారు. కరోనా సమయంలో పక్క రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు పదవీకాంక్షతో మరలా రాష్ట్రమంతా తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంగరాజు విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ప్రజలంతా జగన్ పక్షానే ఉన్నారని, దీనికి ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమని మంగరాజు స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో గుమ్మాపు వరప్రసాద్, పొన్నమండ బాలకృష్ణ, పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

మల్లేశ్వరునికి నాగపంచమి పూజలు



పూజలందుకుంటున్న చెన్నమల్లేశ్వరస్వామి

ఉండి: ఉండిలో వేంచేసి యున్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, స్వయంభూ మహిషాసురమర్దిని అమ్మవార్లకు సోమవారం నాగపంచమి, శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు సన్నిధిరాజు కృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆర్గనైజర్ సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు ఆయన తెలిపారు.